
ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక దీప్తి



2



2

విద్యార్థులకు న్యాయంచేయాలి

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## డీఎడ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

**అక్షరటుడే, ఇందూరు:** డీఎడ్ ప్రవేశ పరీక్షలు అర్హత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 19న జిల్లా కేంద్రంలోని నాగారంలో గల డైట్ కళాశాలలో ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఖాళీల వివరాలను అధికారిక వెబ్‌సైట్ deecet.cdse.telangana.gov.in లో చూడాలన్నారు. అలాగే ప్రైవేటు కళాశాలలో సీట్ల కోసం 20వ తేదీన హాజరుకావాలని సూచించారు.



17-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## జుక్కల్‌కు మంత్రులు సీతక్క, జూపల్లి రాక




**అక్షరటుడే నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గానికి ఈనెల 20న మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు రానున్నట్లు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. పెద్దకొడప్‌గల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న పర్యాటక పనుల శంకుస్థాపనతో పాటు పిట్లం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో వారిరువురు పాల్గొంటారని ఆయన వివరించారు. అనంతరం పెద్దకొడప్‌గల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆదివారం పరిశీలించామని ఎమ్మెల్యే వివరించారు. ఆయన వెంట పెద్దకొడప్‌గల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు మల్లప్పపటేల్ తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటాలి



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా యువజన క్రీడా అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. తాను బాల్ బ్యాడ్మింటన్ క్రీడా కారుడినేనని ఎన్నో పథకాలు సాధించినట్లు గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24 వరకు కొమురం భీం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి శ్యాం, పీఈటీలు పాల్గొన్నారు.

## భారతీయ గ్రామీణ కర్మచారి నూతన కార్యవర్గం



**అక్షరటుడే, ఇందూరు:** భారతీయ గ్రామీణ కర్మాచారి సంఘ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని ఆర్ఎస్ఎస్ భవన్‌లో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా దేవరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ గ్రూప్ సి తెలంగాణ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సర్కిల్ సెక్రెటరీ లింబాద్రి, అసిస్టెంట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డివిజనల్ సెక్రెటరీ సాయ రెడ్డి, వినయ్, సుదీర్ పాల్గొన్నారు.




# ప్రాజెక్ట్‌లకు జలకళ

**ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్ట్‌లు జలకళను సంతరించుకున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షా లతో జలాశయాలు నిండుకుండలా మారాయి. చిన్న తరహా ప్రాజెక్ట్‌లు నిండగా.. ప్రధాన జలాశయాలు అయిన శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్‌కు భారీగా వరద వస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రెండు పంటలకు ఢోకా లేదని ఆనంద పడుతున్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

- ఎస్సారెస్పీకి భారీగా ఇన్‌ఫ్లో
- నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద
- అలుగు పారుతున్న పోచారం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టుల కింద భారీ ఆయకట్టు ఉంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ లక్ష్మి కాలువ ద్వారా బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు సాగు నీరు అందుతుంది. ఎత్తిపోతల పథకాల ద్వారా వేల ఎకరాలు సాగు అవుతాయి. నిజాంసాగర్ ద్వారా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పోచారం ప్రాజెక్ట్ కింద నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పలు గ్రామాలకు సాగు నీరు అందుతోంది. సింగితం, కల్యాణి, కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌ల ఆధారంగా రైతులు పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం ఆయా ప్రాజెక్ట్‌లు నిండుకుండలా మారడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### శ్రీరామ్‌సాగర్‌కు పోటెత్తిన వరద

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. దీంతో జలాశయం నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 1.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల్లో 10 టీఎంసీల నీరు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1086.3(64.03 టీఎంసీలు) అడుగుల నీరు ఉంది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో ప్రాజెక్ట్ గేట్లు తెరిచే అవకాశం ఉంది.

### అలుగు పారుతున్న 'పోచారం'

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌కు పెద్దవాగు, గుండారం వాగుల ద్వారా భారీ వరద వస్తోంది. ఇప్పటికే ప్రాజెక్ట్ నిండటంతో వచ్చిన నీరు అలుగుపై నుంచి మంజీరలోకి వెళ్తోంది. ప్రధాన కాలువ ద్వారా 120 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నాలుగు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తుండటం, వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్ట్ వద్దకు పర్యాటకులను అనుమతించడం లేదు.

### కల్యాణి ప్రాజెక్ట్ ఒక గేటు ఎత్తివేత

ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి ప్రాజెక్ట్‌కు 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నిండడంతో 150 క్యూసెక్కులు మంజీరలోకి వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువకు 60 క్యూసెక్కులు మళ్లిస్తున్నారు.

### సింగితం రిజర్వాయర్‌కు..

నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు అనుసంధానంగా నిర్మించిన సింగితం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 1200 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550మీటర్లు కాగా.. ప్రస్తుతం 416.2 మీ.కు చేరింది. వెయ్యి క్యూసెక్కులను నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లిస్తున్నారు. జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌కు ప్రస్తుతం ఇన్‌ఫ్లో రావడం లేదు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1.237 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.962 టీఎంసీల నీరు ఉంది.

### నిజాంసాగర్‌లోకి..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సింగూరు ప్రాజెక్ట్ ఐదు గేట్లు ఎత్తి 43,634 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నిజాంసాగర్‌లోకి 50,500 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులకు (17.80 టీఎంసీలు) కాగా.. 1400.9 అడుగుల (12.35టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

## యువ ప్రోకబడ్డీ లీగ్‌లోని జట్టుకు కోచ్‌గా ప్రశాంత్



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 హైదరాబాద్‌లో యువ ప్రోకబడ్డీ లీగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులతో 8 జట్లను ఎంపిక చేశారు. కాగా 'శాతవాహన సైనిక' జట్టుకు చీఫ్ కోచ్‌గా జిల్లాకు చెందిన కబడ్డీ శిక్షకుడు ప్రశాంత్ నియామకమయ్యారు. ప్రశాంత్ ప్రస్తుతం జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కబడ్డీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు లింగయ్య, కార్యదర్శి గంగాధర్ రెడ్డి, కోశాధికారి సురేందర్, ఉపాధ్యక్షులు శ్రావణ్ రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు రాజ్ కుమార్, గంగారెడ్డి, శ్రీనివాస్, హైదర్ అలీ, హరిచరణ్, అనురాధ, జ్యోతి తదితరులు అభినందించారు.

## 19న స్పాట్ అడ్మిషన్లు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ జి నాగేశ్వర్ రావు తెలిపారు. ఎల్లారెడ్డి, ఉప్పల్ వాయి, భిక్కనూరు, దోమకొండ, బిచ్కుంద(అచ్చం పేట), లింగంపేట్, తాడ్వాయి, పెద్ద కొడప్‌గల్, ఎక్లారా, కోయగుట్ట (బాన్సువాడ), తాడ్కోల్ పాఠశాలల్లో ఐదు, ఇంటర్ ఫస్టియర్ లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, మూడు జిరాక్స్ ప్రతులతో ఉదయం 9 గంటల లోపు ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సంప్రదించాలన్నారు.

## నాగమడుగులో అధికారుల సందర్శన



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని నాగమడుగు గ్రామంలో లో లెవెల్ బ్రిడ్జిని మండల ప్రత్యేక అధికారి ప్రమీల ఆదివారం ఉదయం సందర్శించారు. వర్షాలు పెరిగితే గ్రామస్థులంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామంలో శిథిలావస్థలో, కూలిన ఇళ్లను పరిశీలించారు. బంజపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయించాలని.. వెనువెంటనే వారికి బిల్లులు పడేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఆమె వెంట ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు భీమ్‌రావు, తుకారాం తదితరులున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తాం..



**అక్షరటుడే, ఆర్మూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా పర్యటించిన తర్వాత ఆయన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేసేందుకు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతామని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గానికి శనిలా తయారైన కాంగ్రెస్, బీజేపీల పీడ వదిలిస్తామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ శ్రేణులు 'స్థానిక 'యుద్ధానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పిలుపునిచ్చారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని మొత్తం 86 గ్రామ పంచాయతీలు, 36 మున్సిపల్ వార్డుల్లో బీఆర్ఎస్ గెలిచి తీరాలన్న కసితో పని చేద్దామని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని, పదేళ్లలో ఆర్మూర్ ప్రగతికి తాము చేసిన కృషిని గుర్తు చేస్తామని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆర్మూర్ నియోజకవర్గానికి ఒక్క విద్యుత్ సబ్సిడీలే రూ.320 కోట్లు వచ్చాయని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. 20 నెలల్లోనే ఆర్మూర్‌ను అంధకారం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీది అవినీతి.. బీజేపీ ది దూర్నీతి అని ప్రజల బాధలు పట్టని బీజేపీ ఎమ్మెల్యే.. ఆర్మూర్‌కు శాపంగా మారాడని జీవన్‌రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమం గిట్టని అధికార కాంగ్రెస్ నేతలు అవినీతి భూతాలుగా మారారన్నారు. ఆర్మూర్ అభివృద్ధికి ఆణాపైసా తేలేని దద్దమ్మలు కాంగ్రెస్, బీజేపీల నాయకులని దుయ్యబట్టారు. అభివృద్ధి, సంక్షేమం గిట్టని బీజేపీ, కాంగ్రెస్‌లకు ఆర్మూర్‌లో చోటులేదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అవినీతి తప్ప అభివృద్ధి పట్టని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డిల ఆగడాలను ప్రజలు భరించే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్‌ను మట్టికరిపించడమే ధ్యేయంగా పోరాడుతానన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యేవరకు తగ్గేదేలేదని స్పష్టం చేశారు.

## బీసీలకు రిజర్వేషన్లు అనేది కాంగ్రెస్ ఆడుతున్న నాటకం: తీన్మార్ మల్లన్న

**అక్షరటుడే, ఇందూరు:** బీసీలకు రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ నాటకమాడుతోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మాధవ నగర్ శివారులోని హోటల్ కృష్ణాలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల ఐక్యత చూసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అగ్రవర్ణాలు నామినేషన్ వేయడానికి కూడా భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా ఒక్కటయ్యారని.. 2029లో బీసీలకు రాజ్యాధికారం వస్తుందని మల్లన్న జోస్యం చెప్పారు. బీసీలకు మించిన రాజకీయ శక్తి ఏదీ లేదని, తన వెనక ఉంది బీసీ ప్రజలేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఐక్యతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పూర్తిగా నాటకమేనని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పేరుతో సీఎం రేవంత్ రెడ్డి డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ కవితతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలు జనరల్‌లో ఉంటే కాంగ్రెస్ ఓసీలకు మాత్రమే సీట్లు కేటాయించిందని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. జిల్లాలో 25 లక్షల మంది బీసీ జనాభా ఉంటే ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా లేకపోవడం శోచనీయమన్నారు. కామారెడ్డిలో బీసీ ఎమ్మెల్యేగా ఉన్న గంప గోవర్ధన్ సీటును కూడా కేసీఆర్ లాక్కున్నాడని విమర్శించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఓడినా.. గెలిచినా ఏడుసార్లు అవకాశం ఇచ్చిందని, అక్కడ ఓసీ జనాభా ఎంత ఉందని ప్రశ్నించారు. బీసీ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డికి ప్రతిసారి ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం మారుస్తూ అన్యాయం చేశారన్నారు. సమావేశంలో తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ హరి శంకర్ గౌడ్, సమన్వయకర్త జానయ్య యాదవ్, సూర్యారావు, నరయ్య గౌడ్, ఓదేలు యాదవ్, బుస్సాపూర్ శంకర్, రమేష్ యాదవ్, రమేష్ పటేల్, నరేందర్, సతీష్ గౌడ్, చంద్రశేఖర్, జ్యోతి, రేఖ, ప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

## బాధిత కుటుంబానికి పరామర్శ



**అక్షరటుడే, నిజాంసాగర్:** పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్త బడే షబ్ కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన వెంట పెద్ద కొడప్‌గల్ మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ హన్మంత్ రెడ్డి, కాస్లాబాద్ సతీష్ యాదవ్, మహ్మద్, పెద్ద కొడప్‌గల్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## '108'లో గర్భిణి ప్రసవం



**అక్షరటుడే, ఆర్మూర్:** గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో 108 వాహనంలోనే ప్రసవం జరిగింది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండలం మాచర్ల గ్రామానికి చెందిన రవితకు ఆదివారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. దీంతో ఆమె కుటుంబ సభ్యులు '108'కు సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటిన గర్భిణి ఇంటికి చేరుకుని ఆమెను దేగాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. అనంతరం అంబులెన్స్‌లో ఆమెను దేగాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. '108' సిబ్బంది ఈఎంటీ శాంతా, పైలెట్ రమేష్, ఆశా వర్కర్ పుష్పకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మీడియా లేనిదే ప్రపంచం లేదు..



**అక్షరటుడే, కోటగిరి:** మీడియా లేనిదే ప్రపంచం లేదని ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. కోటగిరి, పోతంగల్ ఉమ్మడి ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ చోట ఏం జరిగినా క్షణాల్లో మీడియా ద్వారా తెలిసిపోతుందన్నారు. వార్తలను ప్రజలు చేరువ చేయడంలో మీడియా పాత్ర విశేషమని.. అలాంటి మీడియాను ప్రతిఒక్కరూ గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో వార్తాపత్రికలు మాత్రమే ఉండేవని.. ప్రస్తుతం యూట్యూబ్ ఛానళ్లు కూడా వచ్చాయన్నారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పోచారం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టులు సైతం విలువలను కాపాడుతూ.. ప్రజలకు విలువైన సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విలేకరులకు ఎక్కువ సంఖ్యలో డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే వార్తలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ హన్మంత్, విండో ఛైర్మన్ కూచి సిద్దు, ఎస్సై సునీల్, అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, ఉపాధ్యక్షుడు పుల్కంటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కాసుల శ్రీకాంత్, సెక్రెటరీ అనిల్, గౌరవ అధ్యక్షులు రాము, కోశాధికారి అనిల్, సలహాదారులు సాయిలు, ముఖ్య సలహాదారులు గోగినేని హన్మంత్ రావు, రాములు, కార్యవర్గసభ్యులు ఏజాజ్ ఖాన్, జుబేర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక దీప్తి..

పచ్చని కొండల నడుమ, ప్రకృతి ఒడిలో ఒక అద్భుతమైన ఆలయం రూపుదిద్దుకుంటోంది. చుట్టూ పచ్చటి చెట్లు, చల్లని గాలులు, పక్షుల కిలకిలారావాలతో అలరారే ఈ ప్రదేశంలో జరుగుతున్న ఆలయ నిర్మాణం అందరినీ ఆకర్షిస్తోంది. ఈ ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా, పర్యాటకులకు ఆకర్షణీయ స్థలంగా మారనుంది. ప్రకృతి సోయగం మధ్య నిర్మితమవుతున్న ఈ ఆలయం, భక్తి, అందం, సంప్రదాయాల సమ్మిళితంగా నిలవనుంది.

- అక్షరటుడే, బాన్సువాడ

- అద్భుతంగా రూపుదిద్దుకుంటున్న బస్వాపూర్ లింగమేశ్వరాలయం
- రూ. కోట్ల వ్యయంతో నిర్మాణం
- సామాజిక సేవలో తరిస్తున్న రాజశేఖర్

బాన్సువాడ నియోజకవర్గంలోని కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ముమ్మలనేని రాజశేఖర్ పుట్టిన ఊరుపై మమకారంతో ఏకంగా రూ. కోట్ల వ్యయంతో అద్భుతమైన ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పరమశివుడిపై భక్తి, చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రజల ఆప్యాయతను మరువలేక గ్రామాభివృద్ధికి తనవంతు సహాయం చేయాలని సంకల్పించిన ఆయన సొంత ఖర్చుతో అడ్కాస్ పల్లి లింగమేశ్వర ఆలయాన్ని నిర్మిస్తున్నారు. సాంప్రదాయ శైలిలో అద్భుతమైన శిల్పకళా వైభవంతో నిర్మాణం కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటలో ఆలయ శిల్పాలు, రాతి స్తంభాలు చెక్కించారు. గ్రామస్థులు ఆయన ఔదార్యాన్ని ప్రశంసిస్తూ దేవాలయం తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### అనేక సేవా కార్యక్రమాలు

రియల్ ఎస్టేట్‌లో విజయాన్ని సాధించిన ఆయన ఆ సంపాదనలో కొంత స్వగ్రామాభివృద్ధికి వినియోగించాలని నిర్ణయించుకున్నారు. దీంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రు. బాన్సువాడ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు కుర్చీలు, బెంచీలు, బ్లాక్ బోర్డులు, వాటర్ ప్లాంట్లు అందజేశారు. బడులపై ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

### ఆపద సమయాల్లో అండగా..

కరోనా సమయంలో పేదలకు, పారిశుధ్య సిబ్బందికి నిత్యావసరాలు అందజేశారు. అలాగే ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వాలకు విరాళాలు అందజేశారు.

## విద్యార్థులకు న్యాయం చేయాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** బీఈడీ కౌన్సిలింగ్ లో అన్యాయనికి గురైన ఆదివాసీ నాయక్ పోడ్ విద్యార్థులకు న్యాయం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్, ఉద్యోగ సేవా సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ భీమన్న కల్యాణ మండపంలో ఆదివారం నాయకపోడ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఈడీ మొదటి కౌన్సిలింగ్‌లో నాయక్ పోడ్ జిల్లా విద్యార్థులను ఇంటి పేర్లు, గోత్రాలు అడుగుతూ ఇబ్బందులకు గురి చేశారన్నారు. దీంతో వారికి సీట్లు రాకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయమై హైదరాబాద్‌కు తరలి వెళ్లనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బండారు భోజన్న, సలహాదారు సాయన్న, పవన్, రవి, నవీన్, అంజయ్య, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## మురళీకృష్ణ ఆలయంలో స్వచ్ఛత కార్యక్రమం



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమం 17వ వారాలకు చేరుకుంది. దీంట్లో భాగంగా 3వ వార్డు పరిధిలోని మురళీకృష్ణ ఆలయం, నవనాథ బ్రాహ్మణ సేవా సంఘం ఆవరణలో ఆదివారం పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కాలనీవాసులు రాంమూర్తి, రాజేశ్వర్ రావు, దిగంబర్ రావు, పుష్పాకర్ రావు, రాజ్‌కుమార్, సంస్థ సభ్యులు ప్రశాంత్, వేద రాజ్ కుమార్, గణేష్, ముధుసూదన్, గుర్రం రాకేష్ పాల్గొన్నారు.

## అన్నాబావు సాటే చూపిన బాటలో నడవాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** ప్రజలంతా అన్నాబావు సాటే చూపిన బాటలో నడవాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సాహిత్యరత్న లోక షాహీర్ అన్నాబావు సాటే జయంతి సందర్భంగా జుక్కల్ మండలం హంగర్గా గ్రామంలో సాటే విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అన్నాబావు సాటే స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దుండగులు



**అక్షరటుడే, ఇందల్వాయి:** ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దుండగులు కాపర్ తీగలు, ఆయిల్ చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని నల్లవెల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లవెల్లి గ్రామ శివారులోని పొలాల్లో శనివారం రాత్రి మూడు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు. వాటిలోని కాపర్‌వైర్లను, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన రైతులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణ ఉండకపోవడంతో దుండగులు వాటిని టార్గెట్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అయితే వాటిని తిరిగి పనిచేసే విధంగా చేసుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వాటి మరమ్మతుల కోసం విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

## వినాయక చవితికి డీజేలకు అనుమతి లేదు

**అక్షరటుడే, నిజాంసాగర్:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి సూచించారు. బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం డీజే ఆపరేటర్లు, నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా డీజేలను వినియోగించరాదని సూచించారు. డీజే శబ్దాలకు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకొని ఉన్నట్లు తెలిపారు.





## గుండ్ల చెరువులో గణనాథుల నిమజ్జనాలకు ఏర్పాట్లేవి..

**అక్షరటుడే, ఆర్మూర్:** గుండ్ల చెరువులో వినాయక నిమజ్జనాలకు సంబంధించి ప్రత్యేక ఘాట్ నిర్మించలేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజా నరేందర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు స్థానిక గూండ్ల చెరువులో గణేశ్ నిమజ్జనాలకు సంబంధించి ఎందుకు ప్లానింగ్ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గణేశ్ నిమజ్జనాలకు డిజైనింగ్ చేయకపోవడంతో భక్తులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. తక్షణమే మినీట్యాంక్‌బండ్ నిర్మాణంలో భాగంగా ప్రత్యేక ఘాట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. గణేశ్, బతుకమ్మల నిమజ్జనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన మున్సిపల్ అధికారులను కోరారు.